## జ్ఞానేశ్వర్‌కు అవార్డు అందజేసిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న జ్ఞానేశ్వర్

**నాగల్‌గిద్ద, అక్టోబరు 21, ప్రభాత వార్త:** పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మండలంలోని ముక్తా పూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషన్ హరిచంద్ర సాక్షి ఎక్సెన్స్ అవార్డును అందజేశారు. హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శుక్రవారంలో ఏపి గవర్నర్ అవార్డును అందచేసి జ్ఞానేశ్వర్‌ను అభినందిచారు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు మరింతగా కృషి చేస్తానని అవార్డు అందుకున్న జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## బర్దీపూర్ ఆశ్రమంలో కలెక్టర్ పూజలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

**ఝరాసంగం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** బర్దీపూర్‌లోని దత్తగిరి ఆశ్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ రాజర్షీషాలు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమానికి చేరుకున్న అధికారులకు ఘన స్వాగతం పలికారు. ఆశ్రమం లోని జ్యోతిర్లింగం గాలు, పంచ వృక్షాల వద్ద అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆశ్రమ పీఠాధిపతి అవ దూతగిరి మహారాజ్ ఆశీర్వచాలను అందచేసి తీర్థ ప్రసాదాలు అందించారు. దత్తగిరి మహారాజ్(పెద్దప్ప) శత జయంతి వార్షికోత్సవ పోస్టరును ఆవిష్కరించారు. జహీరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, నాయకులు పందరినాథ్,శంకర్, సుభాష్, నర్సింలు, ధన్‌రాజ్ పాటిల్, సిద్దన్న పాటిల్, వైద్యనాథ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

## కులం పేరుతో దూషిస్తే శిక్షార్హులు

### జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వాటి పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు, పరిష్కరించిన కేసులు,పెండింగ్ కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడంపై కేసుల వారీగా పోలీసు, ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారులు, దళిత సంఘాల నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషిస్తూ అవమానిస్తే ఎసీ స, ఎస్టీ(ప్రివెన్షన్ అఫ్ అట్రాసిటీస్)యాక్టు ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. జిల్లా మొత్తం 6 నెలలు స్పెషల్ డ్రైవ్‌గా గ్రామాల్లోనే సమావేశాలు నిర్వహించి కేసులు పరిష్కారం చేయాలని ఆదేశించారు. అధికారులు అందరూ కలిసి వేగంగా కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీ శ్వేత, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పోరేషన్ ఈడీ బి.రామచార్య, ఆర్డీఓ అనంతరెడ్డి, ఎస్సీ వెల్ఫర్ అధికారి కవిత, బీసీ వెల్ఫర్ అధికారి సరోజ, ఏసీపీలు చల్లా దేవరెడ్డి, సతీష్, రమేష్, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

### కలెక్టర్ అధికారులకు సూచన


అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ శరత్

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వెను వెంటనే పూర్తయ్యేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ శరత్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పనులు వెంటటే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ది పనుల నిర్వాహనలో అలక్షంగా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్ అక్షింతలు చల్లారు. గ్రామల్లో క్రీడాప్రాంగణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు అయ్యేలా చొరవ తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌గో డాక్టర్ గాయత్రిదేవికి ఆదేశించారు. 100 శాతం ఇమ్యూనైజేషన్, కరోనా బూస్టర్ టీకాలు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజార్షిషా, వీరారెడ్డి, ఆర్‌డిఓ రమేశ్‌బాబు, మున్సిపల్ కమీషనర్ సుభాష్‌రావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో సంస్మరణ దినోత్సవం


అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న పోలీసులు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** విధి నిర్వాహణలో తమ నిండు ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ యం రమణకుమార్ అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సం (పోలీస్ ఫ్లాగ్ డే)ను శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాన్ని పురస్కరిచుకుని పట్టణంలోఇన పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో స్మృతి పరేడ్ నిర్వహించి అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్‌పి రవీంద్రారెడ్డి జహీరాబాద్ డిఎస్‌పి రఘు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ మహేష్‌గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్స్‌పెక్టర్ బి రమేష్, ఉమెన్ పిఎస్ ఇన్స్‌పెక్టర్ హేమరాణి, ఆర్‌ఐలు కృష్ణ, డానియల్, అమరపోలీసు కుటుంబాల సభ్యులు హాజరయ్యారు.

## దుబ్బాక ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని చట్ట పరంగా శిక్షించాలి

**దుబ్బాక (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 21, ప్రభాత వార్త:** దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పార్టీ మారుతున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని బిజెవైఎం దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ మాదవనేని భాను ప్రసాద్ రావు తెలిపారు. అక్బర్‌పేటభూంపల్లి మండలంలో ఎమ్మెల్యే రఘునంధన్ రావు పార్టీ మారుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని చట్ట పరంగా శిక్షించాలని పోలీస్‌లకు బిజెపి నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘునంధన్ రావు గెలుపుతోనే రాష్ట్రంలో చాలా జఠిలమైన సమస్యలు పరిష్కారమైనాయని తెలిపారు. ప్రశ్నించే గొంతుపై అవాస్తవాలు ప్రచారం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి పునరావృతం కాకుండా చూడాలని బిజెపి కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అక్బర్‌పేట బూత్ అధ్యక్షుడు మండల శ్రీరాములు, ఓబిసి అధ్యక్షుడు పూదరి పెద్దొల్ల నవీన్, బూత్ అధ్యక్షులు నవీణ్, భూపాల్, పరుశురాములు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరులకు సెల్యూట్

## అమరులైన పోలీసు కుటుంబాలకు అండగా ప్రభుత్వం : మంత్రి హరీష్‌రావు


అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు


పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** 1959 అక్టోబర్ 21 నుంచి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి యేటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించడం జరుగుతుందని మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే) సందర్భంగా శుక్రవారం పోలీసు కమిషనరేట్ పరేడ్ మైదానంలో నూతనంగా నిర్మించిన అమవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజల ధన, మాన ప్రాణ రక్షణే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. రాత్రి, పగలు ఎండా, వాన తేడా లేకుండా విధులు నిర్వహించే వారు పోలీసులు అన్నారు. పోలీసు సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు, పోలీసు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. సీపీ ఎన్.శ్వేత మాట్లాడారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, అదనపు జిల్లా కలెక్టర్లు ముజామిల్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పోలీసు అమవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందజేసి ప్రభుత్వ తరపున వస్తున్న సంక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపోగు మహేందర్, పోలీసు అధికారులు రామచంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, చల్లా దేవరెడ్డి, సతీష్, రమేష్, ఫణిందర్, సీఐలు రవికుమార్, బిక్షపతి, జానకీరామ్‌రెడ్డి, కృష్ణ, వీరాప్రసాద్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నా రు.

### పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**మెదక్, అక్టోబర్21 ప్రభాతవార్త:** పోలీసు అమ రవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతి మ సింగ్, జిల్లా అదనపు ఎస్పీ బాలస్వామి, పోలీస్ అధికారులు పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ బాలస్వామి గతేడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 264 మంది పోలీసు అమరవీరుల, మెదక్ జిల్లాకు చెందిన 14 మంది పోలీసు అమరవీరుల పేర్లను చదువుతూ వారి త్యాగాలను అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, అదనపు ఎస్పీ బాలస్వామి, మెదక్ డీఎస్పీ సైదులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, పోలీస్ సిబ్బంది స్మరించుకున్నారు. అనంతరం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు మహానుభావులని, పోలీసు అమరవీరులు చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కొరకు పాటుపడాలన్నారు. దేశ వ్యాప్తంగా సంఘ విద్రోహ శక్తుల ఆగడాలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తూ శాంతి భద్రతలను కాపాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించే వారే పోలీసులు అని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు. కావున పోలీసులు చేస్తున్న సేవలను, త్యాగాలను ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. పోలీసు అమరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 14 మంది మెదక్ జిల్లా అమరవీరుల కుటుంబాలను జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పరామర్శించారు. అమరుల కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ తరపున జ్ఞాపికలను అందజేశారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెదక్ డీఎస్పీ సైదులు, మెదక్ పట్టణ సీఐ మధు, మెదక్ రూరల్ సీఐ విజయ్, జిల్లా పోలీస్ సిబ్బంది, యువకులు 60 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బీ సీఐ నవీన్‌బాబు, మెదక్ పట్టణ సీఐ మధు, మెదక్ రూరల్ సీఐ విజయ్, అల్లాదుర్గ్ సీఐ జార్జ్, ఆర్ఐ నాగేశ్వర్‌రావు, ఐటీ కోర్ ఎస్ఐ సందీప్‌రెడ్డి, జిల్లా సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.


అమరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

## వృత్తి విద్యా కోర్సుల ఫీజులను వెంటనే తగ్గించాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్


మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు జనార్ధన్

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్యా కోర్సుల ఫీజులను వెంటనే తగ్గించాలని.. ఫీజుల పెంచుతున్నట్లు జారీ చేసిన జీవోను వెనక్కు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేరిపోతుల జనార్ధన్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం బీటెక్, ఎంటెక్, ఎంబీఎ ఫీజులను గత ఫీజులకంటే భారీగా పెంచి విద్యార్థులపై మోయలేని భారం మోపిందని మండిపడ్డారు. కరోనా తర్వాత తమ పిల్లలను ఉన్నత విద్యను అందించలేమని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పెంచిన ఫీజుల జీవోలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఫీజులపెంపు ప్రైవేటు కాలేజీల కొమ్ముకాసేలా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని 159 ఇంజనీరింగ్ కాలేజీల్లో టిఎఎఫ్‌ఆర్‌సీ సిఫారుసులతో ప్రభుత్వం ఫీజులు పెంచడం సరికాదన్నారు. ఫీజులు పెంచడం పేద, మధ్యతరగతి విద్యార్థులను ఇంజనీరింగ్ విద్యకు దూరం చేయడమేనని తెలిపారు.

గ్రూప్-1 పరీక్షలపై నిర్లక్ష్యంగా వ్యవ హరించిన తీరుపై ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పెంచిన ఫీజులు వెంటనే తగ్గించాలని లేనియెడల ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు సంగెం మధు, చిట్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొనే విద్యార్థినులను అభినందిస్తున్న డిఇఓ రాజేశ్

## జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఆర్థిక సహాయం

### -27న జలందర్‌కు 19 మంది పయనం

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పంజాబ్‌తోని జలందర్‌లో కొనసాగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ 2 లక్షల రూపాయలను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని హోతి(కె) గ్రామంలోని తెలంగాణ గురుకుల పాఠశాల విద్యార్థినులు కో-కో, వాలీబాల్ పోటీల్లో తలపడేందుకు వెళుతున్న విషయం పాఠకులకు విధితమే. పోటీల్లో తలపడేందుకు 17 మంది విద్యార్థినులు, వారికి సహాయకులుగా ఇరువురు ఉపాధ్యాయులు జలందర్‌కు వెళ్లాల్సి ఉండటంతో వారి రాకపోకలకు, విడిది తదితర ఖర్చులకు గాను మొగుడంపల్లి మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా స్పందించిన కలెక్టర్ 2 లక్షల రూపాయలను మంజూరు చేశారు. మంజూరు చేసిన నిధులను జిల్లా విద్యాధికారి రాజేష్ శుక్రవారం పాఠశాలకు చేరుకుని బాధితులకు అందచేయడంతో పాటు విద్యార్థినులకు ఆల్‌ద బెస్ట్ చెప్పారు. రవాణా ఖర్చులకు నగదును మంజూరు చేసిన జిల్లా కలెక్టర్, అందుకు సహకరించిన డిఇఓ రాజేశ్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, మోహన్‌రెడ్డిలకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.


నత్తి శివకుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న స్వామి

## బిజెపి ఎస్సీమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శివకుమార్

**గజ్వేల్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నత్తి శివకుమార్‌ను నియమిస్తూ శుక్రవారం బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు క్రమశిక్షణతో ప్రజల అభివృద్ధికి కష్టపడి పనిచేయాలన్నారు. బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, జిల్లా బిజెపి అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. బిజెపి జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, బిజెపి కొండపాక మండల అధ్యక్షుడు మన్నె శశిధర్‌రెడ్డి, ఎస్సీ మోర్చ గజ్వేల్ మండల అధ్యక్షుడు మన్నె శేఖర్, బిజెవైఎం నాయకులు రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు రోజుల పాటు మార్కెట్ యార్డు బంద్

### ఎంఎంసి చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** దీపావళి పండుగ సందర్భంగా సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో 5 రోజుల పాటు క్రయ విక్రయాలు నిలిపి వేయడం జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 23 నుంచి 27 వరకు సిద్దిపేట వ్యసాయా మార్కెట్ కమిటీలో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవన్నారు. తిరిగి ఈనెల 28న మార్కెట్ యార్డులో యధావిధిగా క్రయ విక్రయాలు కొనసాగుతాయన్నారు. రైతులు సెలవు రోజుల్లో మార్కెట్‌కు ధాన్యం తీసుకరావొద్దని కోరారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి రవీంద్రారెడ్డి

## సైబర్ నేరాలపై డిఎస్‌పి అవగాహన

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై సంగారెడ్డి డిఎస్‌పి రవీంద్రారెడ్డి శుక్రవారం ఆయా శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకాగా డిఎస్‌పి మాట్లాడుతూ యువత ఫోన్‌లకు అధికంగా అలవాటు పడకుండా చూసుకో వాలన్నారు. తమ సంతా నానికి ఫోన్లు ఇచ్చే ముందు అది వారికి ఎంత వరకు అవసరమో తెలుసుకోవాలని, ఫోన్లు ఇచ్చినా తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవ సరం ఉంద న్నారు. సైబర్ నేరాలపై విద్యాసంస్థల్లో షీ-టీం బృందాలచే అవగా హన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె గాయత్రి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ యం సునిత, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్, బరోసా కేంద్రం ఎస్ఐ రాణి, షీ-టీం యస్ఐ మొగులయ్య, ఎస్‌బిఐ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## స్థానికులకే ఐఎంఎల్ డిపోలో హమాలీ పని కల్పించాలి

**కొల్చారం, అక్టోబర్21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లో చిన్నఘనపూర్ ఐఎంఎల్ డిపోలో స్థానికులకే హమాలీ పని కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచి లక్ష్మీనారాయణగౌడ్, సొసైటీ డైరెక్టర్లు సోమ నర్సింలు, పుల్లబోయిన మల్లేష్, మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ స్థానిక ఐఎంఎల్ డిపోలో చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన యువకులకే హమాలీ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నఘనపూర్ యువకులు తదితరులు ఉన్నారు.

## టూరిజం భవనాల పరిశీలన

**ఝరాసంగం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని తెలంగాణ టూరిజం కార్పోరేసన్ స్థలాన్ని తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా ఆదేశాల మేరకు శుక్రవారం పరిశీలించినట్లు టిఎస్ టూరిజం కార్పోరేసన్ జనరల్ మేనేజర్ కే నాథన్ పేర్కొన్నారు. టూరిజం స్థలంలో గతంలో నిర్మించిన గదులు పూర్తిగా శిథిలావస్తకు చేరుకోవడంతో అక్కడ భక్తులకు అందుతున్న సౌకర్యాలు ఏమిటి అని పరిశీలించారు. రమేష్ నాయ క్, శ్రీధర్‌రెడ్డి, చైతన్య, నరసింహారావు, కేతకి ఆలయ అధికారులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ సంచాలకులకు దరఖాస్తు చేస్తున్న బిజెపి నాయకులు

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విషయమై...
## ఆర్‌టిఐ కింద వివరాలకు బిజెపి నాయకుల దరఖాస్తు

**రామాయంపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధుల విషయాలపై ఆర్‌టీఐ కింద స్థానిక అధికారులకు బిజెపి నాయకులు దరఖాస్తు చేశారు. శుక్రవారం రామాయంపేట బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, ఎంపీడీవో అధికారికి ఆర్‌టీఐ కింద సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 6(1) ప్రకారం 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబందించి మండలంలో, గ్రామాల్లో పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులు, నిర్వహణ, వ్యవసాయానికి సంబందించి సమాచారం కోరుతూ దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా మండలానికి కేంద్ర నిధులు, నిర్వహణ గూర్చి ప్రజలకు తెలియజేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివరాములు, ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, నవీన్‌గౌడ్, కోశాధికారి రమేష్, కిసాన్ మోర్చా నాయకుడు సంగయ్య, ఓబిసి మోర్చా నాయకుడు యాదగిరి, ఎస్‌సి మోర్చా నాయకుడు శ్యాములు, వడ్ల శ్యాము, రంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌దే విజయం
### బిఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌గుప్త

**నర్సాపూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిదే విజయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పైడి శ్రీధర్‌గుప్త పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలతో అక్కడిప్రజలు బిఆర్‌ఎస్ వైపు ఉన్నారని అన్నారు. మునుగోడులో ఇప్పటివరకు ఎమ్మెల్యేగా కొనసాగిన బిజెపి అభ్యర్థిపై ప్రజల విశ్వాసం లేదన్నారు. దీంతో బిఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ప్రజల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. కాగా అక్కడి ప్రచారంలో పాల్గొని ప్రజలనాడీ తెలుసుకున్నామని అన్నారు బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మంచి పేరుండటంతో పాటు రాష్ట్రంలో సిఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలతో బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి విజయం ఖాయమన్నా ధీమానూ వ్యక్తం చేశారు. అంతేగాక మునుగోడులో ప్రచారంలో బిఆర్‌ఎస్ పార్టీ ముందంజలో ఉందన్నారు. ప్రతి గ్రామగ్రామానికివెళ్లి బిఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు తదితర నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మునుగోడులో బిఆర్‌ఎస్ పార్టీ విజయం సాధిస్తుందన్నా ఆశాబావం పైడి శ్రీధర్‌గుప్త వ్యక్తం చేశారు.

## పట్టా భూముల్లో పనులు చేస్తుంటే అడ్డుకుంటున్నారు



పట్టా పాస్ పుస్తకాలు చూపుతున్న పట్టాదారులు

**శివ్వంపేట, అక్టోబర్21 ప్రభాతార్త:** పట్టా భూముల్లో పనులు చేస్తుంటే కొంతమంది అడ్డుకుంటున్నారని పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోగల సర్వే నెం.197లోని 16 ఎకరాల 37 గుంటల భూములను కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ నగరానికి చెందిన ఎం.వీ రవివర్మ కొనుగోలు చేశారు. ఇదిలాఉండగా శుక్రవారం పట్టా భూమిలో ట్రాక్టర్లతో చదును చేస్తుండగా పక్కనే ఉన్న పిట్టలవాడకు చెందిన పలువురు అకారణంగా అడ్డు పడుతూ దాడులకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన పట్టా పాస్ పుస్తకాలు తమ వద్ద ఉన్నాయని, ఈ విషయాన్ని తహశీల్దార్ కార్యాలయంలో, శివ్వంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. కావాలని స్థానిక ప్రజాప్రతినిధులు కొంతమందిని తమపైకి ఉసగొల్పుతున్నారని పట్టాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమకు పూర్తి చేయాలని పట్టాదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఓటరుగా ఉపాధ్యాయులు పేరు నమోదు చేసుకోవాలి



ఓటరుగా నమోదుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నర్సాపూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా అర్హతగల ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సామ్యానాయక్, మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పిఆర్‌టియు టిఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నారాయణపూర్‌లోగల టిటిడబ్ల్యుఆర్‌ఎస్ గర్ల్స్ పాఠశాలలో ఫారమ్ 19 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల నరిష్కారం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమమే తమ ఎజెండాగా అసెంబ్లీలో మన వాణి వినిపించే వ్యక్తులను ఎన్నుకునేఅవకాశం ఓటు హక్కుద్వార వచ్చిందన్నారు ఇటువంటి అవకాశాన్ని వృధాచేసుకోకుండా ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియు టిఎస్ అధికార అభ్యర్థిగా గుట్టం చెన్నకేశవరెడ్డి పోటీ చేస్తున్నారని ఆయనను గెలిపించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకుందామని పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు సామ్యానాయక్, మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు మమత, రామేశ్వరి, స్వాతి,అనిత, బాగ్య, లత, విజయ,సుజాత, పద్మ తదితర ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తకు ఆర్థిక సహాయం అందజేత

**నిజాంపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందిగామ గ్రామానికిచెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ బ్రహ్మాచారి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని తెలుసుకొని శుక్రవారం టీపీసీసీ ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రొయ్యల పోచయ్య, రామాయంపేట పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేశ్, నందిగామ మాజీ సర్పంచ్ ఆకుల బాలయ్య, గ్రామ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు బాల్‌రెడ్డి, గోరుమిళ్ల ఆంజనేయులు, చాకలి వెంకటి (వైఎస్), ఇమామ్ సాబ్, లక్ష్మీనారాయన, రాజశేఖర్, వినోద్, మల్లేశం పాల్గొన్నారు.

## యువత ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి

**నర్సాపూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా ఉపాధీ మార్గాలను ఎంచుకొని ఉపాధిని పొందాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని మెదక్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన హమ్‌సఫర్ ప్యామిలీ రెస్టారెంట్‌ను మురళీయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ ప్యామిలీ రెస్టారెంట్ ద్వార ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈకార్యక్రమంలోనిర్వాహకులు సాయి, పండితులు హరిప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# 'తొలిమెట్టు'ను విజయవంతం చేయాలి

### రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డ్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా విద్యాధికారి రమేష్



విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న కృష్ణారావు

**కొల్చారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** ఎఫ్ఎల్ఎన్(తొలిమెట్టు) మానిటరింగ్‌లో భాగంగా రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డ్ డైరెక్టర్ కృష్ణారావు, జిల్లా విద్యాధికారి రమేష్, సెక్టోరియల్ ఆఫీసర్ సుభాష్, మండల విద్యాధికారి నీలకంఠం కొల్చారం మండలంలోని కేజీబీవీ, అప్పాజిపల్లి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరును, విద్యార్థుల ప్రతిస్పందనను పర్యవేక్షించారు. సూచనలు సలహాలు అందించారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికై ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. వారి బోధన పద్దతులలో మెళకువలను పాటించి సరైన పాఠ్యప్రణాళికలతో, బోధనాభ్యాసన సామాగ్రితో విద్యార్థులకు అర్థమయ్యేతీరులో బోధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెంచటానికి తొలిమెట్టు లక్ష్యాన్ని సాధించే విధంగా వారు కృషి చేయాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రమేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనా పద్ధతుల్లో మెళకువలు పాటించాలన్నారు. టైంటేబుల్ నిర్వహణ, టీఎల్ఎం, పుస్తకాల వినియోగం, లెస్సన్ ప్లాన్స్ తయారు చేసుకోవడం, లైబ్రరీ నిర్వహణ తొలిమెట్టు కార్యక్రమంలో ప్రతి అంశాన్ని, లక్ష్యాన్ని సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అలాగే కొల్చారం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ,ఉపాధ్యాయులు సతీష్, రాజు, అనురాధ, అరుణ, ఐఈఆర్‌పీ కనకరాజు, ఎంఐఎస్ సంపత్, సీఆర్‌పీలు సాయికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణపనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
### జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి

**రాయపోల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ నుండి 4 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రైతు బంధు మండల అధ్యక్షులు రేకుల నరసింహారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, నాయకులు శ్రీనివాస్, వీరాస్వామి, రాజు, విష్ణు పాల్గొన్నారు.

## రామ నామ స్మరణతో మార్మోగిన దామరకుంట

**మర్కుక్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** జై శ్రీరామ్ అపర పాండరిపుర క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ రుక్మిణిపాండురంగ ఆశ్రమం గురువు సంకల్పించినటువంటి శతకోటి హరే రామ నామ జప యజ్ఞంలో భాగంగా మేము సైతం అంటూ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని దామరకుంట గ్రామంలో బ్రహ్మశ్రీ గుండు శ్రీనుగోపాలశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామ మందిరం నుండి హరే రామ నామ భజన అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు ప్రారంభమై 6.30 గంటల వరకు నామ సంకీర్తణ గ్రామ ప్రదక్షిణంతో ఎంతో అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రిబాల్‌నర్సయ్య, ఎంపిటిసి కృష్ణయాదవ్, ఉపసర్పంచ్ అంజయ్య, రాంగోపాల్‌శర్మ, గ్రామంలోని ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని గ్రామ సంకీర్తణ కార్యక్రమాన్ని దిగ్విజయపరిచారు.



దామరకుంటలో రామ నామ స్మరణతో నగరసంకీర్తణ చేస్తున్న దృశ్యం

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, బియ్యం అందజేత

**సిద్దిపేట అర్బన్(చిన్నకోడూరు), అక్టోబర్ 21, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్రవెల్లి అజయ్‌కుమార్ గత నాలుగు రోజుల క్రితం కరెంట్ షాక్‌తో మృతి చెందగా శుక్రవారం బాధిత కుటుంబీకులను జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం 50 కిలల్ బియ్యంతో పాటు రూ.4 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు, బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి మంద పాండు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలోనే జీవితంలో నిజమైనా తృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తెల్జర్ శ్రీనివాస్, ఎంపిటిసి లచ్చయ్య, మాజీ సర్పంచ్ ఎర్రవెల్లి ముత్తయ్య, మాజీ ఉప సర్పంచ్ ఎర్రవెల్లి నరసయ్య, బీఎస్పీ నాయకులు రోమాల బాబు, పుల్లూరు ఉమేష్, జ్యోతి స్వచ్ఛంద సంస్థ చిన్నకోడూరు మండల అధ్యక్షులు గాజుల రవి పాల్గొన్నారు.

## పత్తి పంట పరిశీలన

**రాయపోల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** రాయల్ సీడ్స్ వారి రణధీర్ పత్తి రకం సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని రణదీర్ కంపెనీ డైరెక్టర్ లింగ స్వామి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో రాయల్ సీడ్స్ రణధీర్ పత్తి రకం పంటను రైతులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సూర్ణ బిక్షపతి రాయల సీడ్స్ వారి రణదీర్ పతినత రకం పంట వేశారు. మండలంలోని వివిధ గ్రామాల రైతులు పంటను పరిశీలించారు. సుమారుగా 850 మంది రైతులు ఈ పంట పరిశీలనకు వచ్చారని తెలిపారు

## 7వ వార్డులో పర్యటించిన గడా ప్రత్యేకాధికారి

**గజ్వేల్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిలు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్ వార్డులో ఉన్న సమస్యల గురించి గడా అధికారి ముత్యంరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో సిసి రోడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, త్వరలో సిసి రోడ్లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. పలు వార్డుల సమస్యలను గడా దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గడా అధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళిలు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వంద కోట్ల రూపాయలతో యుజిడి పనులు జరుగుతున్నాయని, పనులు తుది దశకు చేరుకున్నాయని రెండుమూడు నెలల్లో మున్సిపల్‌లోని ప్రతి వార్డుల్లో సిసి రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. వారివెంట ఏఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



వార్డులో పర్యటిస్తున్న గడాఅధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్‌చైర్మన్ రాజమౌళి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న హేమలత శేఖర్‌గౌడ్

## పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం
### -జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్

**మనోహరాబాద్, అక్టోబర్21 ప్రభాతవార్త:** పేద ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం తన కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తూప్రాన్‌కు చెందిన బి. శ్రీనివాస్‌కు 60 వేలు, కంసాన్‌పల్లికి చెందిన లక్ష్మయ్యకు 7 వేలు, చెట్ల తిమ్మాయిపల్లికి చెందిన ఒక వ్యక్తికి 25 వేలు, దండుపల్లికి చెందిన ముత్యాలుకు 60 వేలు, కూచారంకు చెందిన భాస్కర్‌కు 60 వేలు, లింగారెడ్డిపేటకు చెందిన ఒక వ్యక్తి 37 వేల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రతన్‌లాల్, మహేందర్‌గౌడ్, నాగిరెడ్డి, శ్రీరామ్, హరీష్, సోములు, సురేష్ పాల్గొన్నారు.

## పైలేరియా రహిత జిల్లాగా సిద్దిపేటను తీర్చిదిద్దాలి
### డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జూలూరి కాశీనాథ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పైలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జూలూరి కాశీనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మోడల్, న్యూ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న పైలేరియా ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండిఎ కార్యక్రమ తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైలేరియా వ్యాధి నివారణ కోసం ప్రజలు మాత్రలను వేసుకోవడం తప్పనిసరి అన్నారు. పైలేరియా మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు రావన్నారు. ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకొని పైలేరియా నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోండి.. పైలేరియా నుండి రక్షణ పొందండి
### -డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ శ్రీధర్

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** ప్రజలు బోధకాలు వ్యాధి రాకుండా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకొని వ్యాధి నుండి రక్షణ పొందాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పైలేరియా మాత్రలను పంపిణీ చేస్తుండగా కార్యక్రమంలో ఆయన ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు మాసూరి కావ్యదర్గయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలను వేసుకొని బోధకాలురాకుండా జాగ్రత్తపడాలని అన్నారు. కార్యక్రమంలో తీగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నివేదిత, ఏఎన్ఎం మంజుల, ఆశ వర్కర్ సైదిగారి మమత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## డిసీఈతోనే పైలేరియా అంతం
### డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ

**మిరుదొడ్డి, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** డీఈసీ మాత్రలతోనే పైలేరియా వ్యాధి అంతం అవుతుందని సిద్దిపేట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మిరుదొడ్డి పిహెచ్‌సి పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎండిఎ కార్యక్రమాన్ని అయన శుక్రవారం పర్యవేక్షించారు. ఆల్వాల్ హాస్టల్లె విద్యార్థులకు మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల పైలేరియా వ్యాధి సోకుతుంద న్నారు. దోమకాటు తర్వాత పైలేరియా వ్యాధి లక్షణాలు కనబడటానికి సంవత్సర కాలం పడుతుందన్నారు. వ్యాధికారక క్రిములను చంపి వేయడానికి ఈ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రెండేళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజ్మోహన్‌రెడ్డి, అనుదీప్, సిహెచ్ఓ లింగమూర్తి, హెచ్ఇ సత్యనారాయణ, సిబ్బంది రవి,సుధ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కొండాపూర్, మిరుదొడ్డిలో ఇంటి ఇంటికి తిరిగి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమ నిర్వహణపై అయన సంతృప్తి వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**కొల్చారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొదటి విడత 90 విద్యార్థినిలకు ఏకరూప దుస్తులను ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్. నర్సింలు, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రాజుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సేవలు మరవలేనివని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పాపన్నపేటలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులైన హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుల్ ప్రసాద్, రాంచందర్, నర్సింహులు,అబీద్‌హుసేన్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా శాంతి భద్రతలను కాపాడేందుకు పోరాడిన వీరులని కొనియాడారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ గాలయ్య, హెడ్ కానిస్టేబుల్ పూర్య నాయక్, రఘునాథ్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో భారీ ర్యాలీ**

**నర్సాపూర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎస్ఐ గంగరాజు ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పోలీసులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ ప్రధాన రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరిస్తూ పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ గంగరాజుతో పాటు నర్సాపూర్ ఎస్ఐ2 శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత వైద్య శిబిరం...**

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబర్ 21, ప్రభాతవార్త** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రామాయంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. పట్టణంలోని సంజీవని ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంబించారు. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చేగుంట, చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 60 మందికి పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. పోలీసులతోపాటు అధికారులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, సుభాష్‌గౌడ్, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసులకు సన్మానం...**

**టేక్మాల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టేక్మాల్ పోలీసులను ధనుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. టేక్మాల్ ఎస్ఐ లింగం, సహాయ సిబ్బందిని ధనూర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవయ్య, ఉపాధ్యాయులు వరప్రసాద్, కిరణ్, లత, ప్రభాకర్, శ్రావణ్, రమేష్‌గౌడ్, నస్రత్‌బేగం, వివి శ్రీకాంత్‌లు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమకూర్చిన నిధిని పోలీసు అమరవీరుల సంక్షేమ నిధికి విరాళంగా అంద జేశారు. విద్యార్థుల్లోనసేవాభవాన్ని పెంపొదించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేస్తున్నట్లు ఉపాధ్యాయులు చెప్పారు.

**విద్యార్థులకు 'ఓపెన్ హౌజ్'**

**వెల్దుర్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు ఏఎస్ఐ వసురాం ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధి నిర్వహణ, కేసుల నమోదు, దర్యాప్తుపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో అమరులైన పోలీసులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ ప్రతాప్‌సింగ్ రాథోడ్, పోలీసులు రామచంద్రారెడ్డి, కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి**

**కొల్చారం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ఏఎస్ఐలు తారాసింగ్, వాణి అన్నారు. శుక్రవారం కొల్చారంలో పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గ్రామంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ముందుకు సాగుతూ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. దారి పొడవునా విద్యార్థులు పోలీసు అమరవీరులకు నివాళులు అర్పిస్తూ నినిదాలు చేశారు. ఈ సందర్భంగా బస్‌స్టాండ్ ఆవరణలో 2 నిమిషాలు మౌనం పాటించి పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తారాసింగ్, హెడ్ కానిస్టేబుల్ లాయక్ అలీ, దత్తు, మహేష్, సౌందర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, పీఈటీ శ్రీనివారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



నర్సాపూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీ దృశ్యం



రామాయంపేటలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి



టేక్మాల్‌లో ఎస్ఐని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



వెల్దుర్తిలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



కొల్చారంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు



ఎన్ఎంఆర్ యువసేనలో చేరిన కాంగ్రెస్ నాయకుల దృశ్యం

## ఎన్ఎంఆర్ యువసేన చేరిన కాంగ్రెస్ శ్రేణులు

**జిన్నారం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** జిన్నారం మాజీ ఎంపిటిసి సభ్యులు పొట్టి భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేసి ఎన్ఎంఆర్ యువసేనలో శుక్రవారం చేరిపోయారు. జిన్నారంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఎన్ఎంఆర్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఉద్యమనాయకులు నీలం మధు కాంగ్రెస్ నాయకులను యువసేనలోకి శాలువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. ప్రజలకు రౌండ్‌ద క్లాక్‌గా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ నాయకులు, యువసేనలో చేరిన నాయకులు పాల్గొన్నారు.

## మునుగోడులో బిజెపి నాయకుల ప్రచారం



మునుగోడులో ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులు రవీందర్‌రెడ్డి

**జిన్నారం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా మునుగోడు శాసన సభ ఉప ఎన్నికలను పురస్కరించుకుని శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీ భారతీయ జనతా పార్టీ నాయకులు టి రవీందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డికి ఉప ఎన్నికలో మద్దుతు పలికాలని ప్రజలకు విన్నవించుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని నారాయణపురం మండలం జనగాం గ్రామంలో రవీందర్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతూ బిజెపికి ఓటు వేయాలని వివరించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు అదెల్లి రవీందర్, అమీన్‌పూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు ఆగారెడ్డి, పటాన్‌చెరువు నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దీపావళికి పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తాం : ఎస్ఐ

**జోగిపేట, అక్టోబర్21, ప్రభాతవార్త:** దీపావళి పండగను పురస్కరించుకుని ఎవరైనా పేకాట ఆడితే వారిపై కఠిన చర్యలు చేపడతామని జోగిపేట ఎస్ఐ సామ్యానాయక్ హెచ్చరించారు. దీపావళి పండగ సందర్భంగా పేకాట జోరుగా సాగుతున్న విషయమై ఈ సారి కఠినంగా వ్యవహరిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరూకూడా పేకాట ఆడవద్దన్నారు. ఎవరైనా పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దీపావళి పండగను సంతోషంగా జరుపుకోవాలని, పిల్లలకు టపాకాయలు కాల్చేప్పుడు ప్రమాదాలు జరగకుండా తల్లితండ్రులు జాగ్రతలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## పేదవారికి ఆసరాగా రోటరీ క్లబ్

**ములుగు, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** పేదవారిని ఆదుకోవడంలో రోటరీ ఇంటర్నేషనల్ ఎప్పుడు ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. ములుగు మండలం నాగిరెడ్డిపల్లిలో సఫాయి కార్మికులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదవాళ్ళు ఆర్థికంగా ఎదిగే దిశగా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ కరుణాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ నర్సింహ్మారెడ్డి, ఎంపిటిసిల ఫోరం ములుగు మండల అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, రోటరీ క్లబ్ కోశాధికారి నర్సింహ్మారెడ్డి, పూర్వ అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, జగదీశ్వర్, సభ్యులు సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటను పరిశీలించిన అధికారులు

**మనూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండలంలోని జంగిరి, ఉసిరికపల్లి గ్రామాల్లో అంకుర్ సీడ్స్ వారు సరఫరా చేసిన అనీష్ బిజి-2 రకం పత్తి విత్తనాలతో సాగవుతున్న పత్తి పంటను అధికారులు, రైతులు సోమవారం పరిశీలించారు. అనీష్ బిజి-2 రకం పత్తి పంట ఏపుగా పెరిగిందని, ఒక్కో చెట్టుకు 75 నుంచి 80వరకు పెద్ద పెద్ద కాయలు కాయడాన్ని రైతులు గమనించారు. ఎకర భూమిలో12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని పంటను సాగుచేస్తున్న రైతులు నందురావు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంకుర్ కంపెనీ ప్రతినిధులు హరివర్మ, శ్రీకాంత్, కమలాకర్, డిస్ట్రిబ్యూటర్లు నర్సింహారెడ్డి, వీరన్న, రమణారెడ్డి, గ్రామంతో పాటు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా వార్షికోత్సవం వేడుకలు

ఇనార్బిట్‌మాల్ సైబరాబాద్ 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. దానితో పాటుగా వేడుకలు కూడా తారాస్థాయికి చేరాయి. తమ విలాస అవసరాలను తీర్చుకోవడానికి ఎంతో కాలంగా హైదరాబాద్ నగరవాసులు ఇనార్బిట్ మాల్కు వెళ్తున్నారు. అత్యున్నత శ్రేణి షాపింగ్ వెల్నెస్ అనుభవాలకోసం స్థానికులు ఇక్కకు పయనమవుతున్నారు. నగర మధ్యలో ఉండటం వల్ల నగరావాసులు ఈ మా ల్కు చేరుకోవడం కూడా సులభం. ఇదొక్కటేకాదు ఈ మాల్కు నగరవాసులు అభిమా నించడానికి మరెన్నో కారణాలు కూడా ఉన్నాయి. మాల్ వార్షికోత్సవం వేళ నగరవాసులు ఈ మాల్కు మరలమరల రావడానికి నగదును స్వేచ్ఛగా ఖర్చు పెట్టేసిన తర్వాత తిగిరి పొందడం సాధ్యమేనా? ఇనార్బిట్ మాల్లో సాధ్యమే మీరు కొనుగోలు చేయడంతో పాటుగా కాయిన్స్ రూపంలో పాయింట్లను పొందివాటిని రిడీమ్ చేసుకోవచ్చు.

## ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డికి ఎంఆర్‌పిఎస్ సన్మానం

**ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వి.అశోక్‌రెడ్డిని శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు సన్మానించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎంఆర్‌పిఎస్ నాయకులు సీఐని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలదండలతో సత్కరించి కొద్దిసేపు మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు సగ్గు శివకుమార్, రాష్ట్ర నాయకులు ఏనూతల నాగేశ్, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షులు మెల్గురం నరేందర్, నాయకులు మొత్కుపల్లి శ్రీనివా స్, కప్పరగళ్ల అంజనేయులు, బొడ్డు నర్సింగ్‌రావు, రామోహన్‌లు పాల్గొన్నారు.

## ఇళ్ల పరిసరాల్లో చెత్త వేయకూడదు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:**

ఇంటి పరిసరాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉండేలా శ్రద్ద వహించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ పి.వేమనరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సి పల్ 8వ వార్డులోని కొండాపూర్ వార్డు కార్యాలయ ఆవరణలో స్వచ్ఛసర్వేక్షన్ 2023లో భాగంగా తడిచెత్త, పొడిచెత్తల పై ప్రజలకు అవగాహ న కల్పించారు. కౌన్సిలర్ చిల్కూరి హేమలత, మేనేజర్ మర్రి అంజిరెడ్డి పాల్గొన్నారు.

### ఎకోవాక్స్ రోబోటిక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా యామీ గౌతమ్

హోమ్ సర్వీస్ రోబోటిక్స్‌లో అగ్రగామిగా ఉన్న ఎకోవాక్స్ రోబోటిక్స్ తమ మొదటి భారతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటియామీ గౌతమ్‌ను ప్రక టించింది. యామీ గౌతమ్‌తో భాగస్వామ్యం ఎకోవాక్స్ పూర్తి స్థాయిలో హోమ్ సర్వీస్ రోబోటిక్స్ రోబోటిక్స్ ఫర్ ఆల్ బ్రాండ్ దృష్టికి అద్దం పడుతుంది. వైస్ ప్రెసిడెంట్ జూనీజు మాట్లాడుతూ బ్రాండ్ అంబాసిడర్‌గా యామీ గౌతమ్‌ను ప్రకటించడంపట్ల తాము సంతోషిస్తున్నామన్నారు.



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# పోలీసుల సేవలు చిరస్మరణీయం : డిఎస్‌పి

**పటాన్‌చెరువు, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరువులో సోమవారం పోలీసులు ఘనంగా జరుపుకున్నారు. పటాన్‌చెరువు డిఎస్‌పి భీంరెడ్డి ఆధ్వర్యంలో సాగిన దినోత్సవాన్ని పురష్కరించుకుని పోలీసులు, విద్యార్థులు, నాయకులు పట్టణంలోని మైత్రీ మైదానం నుంచి పోలీసు ఠాణా వరకు పోలీసులకు అనుకూలంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడెం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందన్నారు. ప్రజల క్షేమానికి, శాంతి భద్రతల కోసం అహర్నిశలు పాటుపడుతున్న పోలీసులను గౌరవ మర్యాదలతో చూసుకోవాల్సి న అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. భారత దేశంలో తెలంగాణలోనే మొదటి మారు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు జరుగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరువు తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, బల్దియా డిప్యూటీ కమీషనర్ బాలయ్య, ఎంఇఓ రాథోడ్, సిఐలు వేణుగోపాల్‌రెడ్డి, భీసన్న, శ్రీనివాస్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పోలసు సిబ్బంది పాల్గొన్నారు.

**జిన్నారంలో..**



జిన్నారంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థుల దృశ్యం

**జిన్నారం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన జిన్నారంలో శుక్రవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో పాఠశాల విద్యార్థులు, ఆయా పార్టీల నాయకులతో కలిసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అమరవీర పోలీసులు చేసిన త్యాగాలను సిఐ స్మరించుకున్నారు. అమరులైన పోలీసు వీరుకలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐ వేణుకుమార్, ఎంపిపి అధ్యక్షులు రవీందర్‌గౌడ్, ఎస్ఐ సిద్దిరాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్‌చెరువులో ఫొటో గ్రఫీ వర్క్ షాప్



రాష్ట్రస్థాయి ఫోటో గ్రఫీ వర్క్ షాప్‌ను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి దృశ్యం

**పటాన్‌చెరువు, అక్టోబరు 21, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరువు పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గ్రేటర్ హైద్రాబాద్, పటాన్‌చెరువు ఫోటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సెమినార్‌ను టిఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గూడెం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పుడే తాము నడుస్తున్న రంగంలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఫోటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి పటాన్‌చెరువు శాసన సభ్యులు అందిస్తున్న సహకారాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్, రాష్ట్ర సంఘం కోశాధికారి మునుగాల శైలేందర్, గ్రేటర్ హైద్రాబాద్ సంఘం అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి నక్క సంజీవ్ కుమార్, కోశాధికారి గద్దం లక్ష్మారెడ్డి, సంఘం నాయకులు, ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా పరిధిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



మర్కుక్ పాఠశాలలో ఎస్ఐ హరీష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శుక్రవారం మండలకేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ మైత్రి, పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ హరీష్‌గౌడ్, ఏఎస్ఐ పరిపూర్ణచారి, హెడ్‌కానిస్టేబుల్ బాల కృష్ణ, పోలీస్ సిబ్బంది సాజిద్, కృష్ణ, మహేష్, షకీరాలను శాలువాలతో సత్కరించి పూల బొకేలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరీష్‌గౌడ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణాలు అర్పించిన పోలీసుల సేవలు మరువలేనివని అన్నారు. అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిఎల్‌టి కో-ఆర్డినేటర్ అమర్‌నాథ్‌రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైత్రి అల్వాల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి రమణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు నరహరిప్రసాద్, వందన, నాగేశ్వర్‌రావు, విద్యాధర్‌రెడ్డి, రమాకాంత్‌రావు, సిద్దయ్య, వెంకటేశ్వర్లు, సంతోష, రజిని, భ్రమరాంభ, శ్రీలత, సిఆర్‌పి నాయక్, మునీర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్‌లో పోలీసులకు సన్మానం

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో అక్షర పాఠశాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కృష్ణమూర్తితో పాటు పోలీస్ సిబ్బందిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో శాంతిభద్రతలు, దేశ రక్షణ కోసం ఎంతో మంది తమ ప్రాణాలను పనంగా పెట్టారన్నారు. పోలీసు వృత్తి ఎంతో గొప్పదని అన్నారు. పోలీస్ సిబ్బందికి మిఠాయిలు తినిపించి విద్యార్థులు గులాబి పూలను అందజేశారు. అంతకు ముందు అక్షర పాఠశాల ఆవరణలో పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అక్షర పాఠశాల కరస్పాండెంట్ గుర్జకుంట రామస్వామి, ప్రిన్సిపాల్ కె.సంతోషజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ బైరోజు సుదర్శన్, సిబ్బంది రేణుక, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్ పోలీసులను సన్మానించిన దృశ్యం



జోగిపేట నుంచి పాదయాత్ర చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

## భారత్ జోడో యాత్రకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

**జోగిపేట, అక్టోబర్21, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్రకు సంఘీభావంగా అందోలు నియోజకవర్గానికి చెందిన ఇద్దరు యూత్ కాంగ్రెస్ నాయకులు జోగిపేట నుంచి మక్తల్ వరకు చేయనున్న పాదయాత్రను శుక్ర వారంనాడు జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. జోగిపేట పట్టణానికి చెందిన మాజీ ఎంపిటిసి డాకూరి వెంకటేశం, కౌన్సిలర్లు చిట్టిబాబు, హరిక్రిష్ణాగౌడ్, డాకూరి శంకర్‌లు పాదయాత్ర చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు సామ్యానాయక్, దేద్యానాయక్‌లకు పూలదండలు, శాలువాలతో సన్మానించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేస్తున్న భారత్ జోడో యాత్ర ఒక మంచి కార్యక్రమం అని, దీనివల్ల దేశంలో ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవటంతోపాటు కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేశారెడ్డి, మున్నూరు కిషన్, రవిశేఖర్‌రెడ్డి, తుడుం రాములు, రాజశేఖర్, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర పంటలపై సస్యరక్షణ చర్యలు అవసరం

**-మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎవో అనిత**

**సదాశివపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** రైతులు పత్తి పంట సాగులో వ్యవసాయ అధికారుల సలహాల ప్రకారం సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆత్మ కమిటి చైర్మన్ కృష్ణగౌడ్, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎవో అనిత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో గల రైతు వేదికలో ఆత్మ కమిటి అధ్వర్యంలో ఎరువుల వాడకం వలనలాభాలు, ఎరువుల యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి, ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమీనా అంజూమ్, టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆరీఫోద్దిన్, ఎడిఎ మనోహర, ఏఈవో ప్రభుచరణ్, ఆత్మ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## అనాథ బాల కార్మికునికి ఎంఈఓ ఆశ్రమం



రవికుమార్‌ను వికాస్ ఆశ్రమంలో చేర్పిస్తున్న ఎంఈఓ అంజయ్య

**సదాశివపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** సదాశివపేట మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మద్దికుంట రవికుమార్ 14సంవత్సరాలు 2011లో తండ్రి రాములు, 2017లో తల్లి పద్మ మృతి చెందడంతో గత రెండు సంవత్సరాల నుండి పాఠశాలకు వెళ్ళకుండా అనాథ బాలకార్మికుడైయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల విద్యాధికారి అంజయ్య 1098చైల్డ్‌లైన్ సమాచారం ఇవ్వడంతో విద్యార్థి సంగారెడ్డి జిల్లా చైల్డ్ హెల్ప్ కమిటి వారి ఆదేశాలతో నిజాంపేట గ్రామంలోని ఆర్నాల్డ్ బాల వికాస్ ఆశ్రమంలో చేర్పించి నిజాంపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. విద్యార్థికి హాస్టల్ వసతి, పాఠశాల నోటు పుస్తకాలు, దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. 6నుండి 14సంవత్సరాల వయస్సు గల వారు ప్రతి ఒక్కరు వంద శాతం చదువుకోవాలని మండల విద్యాధికారి అంజయ్య అన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యులు, చైల్డ్‌లై న్ సంస్థ సభ్యులు నవీన్, నారాయణఖేడ్ మండల విద్యాధికారి విశ్వనాథం, నిజాం పేట సిఆర్‌పి వెంకటరాంరెడ్డి, పుల్కల్ సిఆర్‌పి మల్లేశం, ఆర్నాల్డ్ బాల వికాస్ కేంద్రం నిర్వాహకులు అల్విన్, నిజాంపేటఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

## గీతమ్‌లో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభోత్సవం

**పటాన్‌చెరువు, అక్టోబరు 21, ప్రభాతవార్త:** గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రమాణ-2కె23 సచివాలయాన్ని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ సీతారామయ్య, స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ కరుణాకర్ బి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌లు శుక్రవారం సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవం చేశారు. గీతం యూనివర్సిటీలో ప్రతి సంవత్సరం మూడు రోజుల పాటు సాంకేతిక-సాహిత్య-నిర్వహణల మేలు కలయికగా నిర్వహించే మూడు రోజుల పండగను సన్నాహకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, పోటీలతో పాటు ర్యాంప్ వాక్ సిఫోనీ, కన్సర్ట్, బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్, కార్నివాల్, పలు యాజమాన్య వేళకు వలను నేర్పే ఈ పోటల సమాహారంగా కార్యక్రమం కొనసాగుతందని గీతం బాధ్యులు పేర్కొన్నారు. ఈసందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ నూతన సాంకేతిక మేళవింపుతో కార్యక్రమాలను ఎంపికచేసి, ఇతర కళాశాలల విద్యార్థులు విరివిగా పాల్గొనేలా వాటిని రూపొందింఆమన్నారు. ఆయా విభాగాధిపలుతు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎంవీవీఎష్ మూర్తికి ఈ సందర్భంగా నివాళులు అర్పించారు.

## పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివి

**కొమురవెల్లి మల్లన్న దేవాలయం డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్**



బాటసారులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆలయ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సేవలు మరువలేనివని కొమురవెల్లి మల్లన్న దేవాల యం పాలక మండలి సభ్యుడు మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్(గుండు శీను) అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోడల్ బస్టాండ్ వద్ద బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గా ్యదరి రవి, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జుంటుపల్లిని సందర్శించిన బిసి కమిషన్ చైర్మన్

**యాలాల అక్టోబరు 21, ప్రభాతవార్త :**

అతిసార, డయోరియా విజ్రంభనతో అతలాకుతలమైన యాలాల మండలం జుంటుపల్లి గ్రామాన్ని శుక్రవారం రాష్ట్ర బిసి కమీషన్ చైర్మన్ శుభప్రద్ పటేల్ సందర్శించారు. గ్రామంలో గత పది రోజుల క్రితం నుంచి డయోరియా ప్రభలి సుమారు 75 మంది అస్వస్థకు గురికాగా ఒకరు మృతి చెందారు. మంచినీటి పప్‌లైన్ల లీకేజీలతో మంచినీటి వ్యవస్థ అస్థవ్యస్తంగా మారింది. తద్వార గ్రామంలో అతిసార, డయోరియా వ్యాధి విజ్రంభించిందని తెలిం ది. ఈ క్రమంలో బిసి కమీషన్ సభ్యులు శుభప్రద్ పటేల్ యువ సేన ఆద్వర్యంలో ట్యాంకుల ద్వారా అక్కంపల్లి, జుంటుపల్లి గ్రామాలకు మంచినీరు మినరల్ వాటర్ పంపిణీ చేపట్టడం జరిగింది. శుక్రవారం జుంటుపల్లిలో పర్యటించిన పటేల్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తిప్పమ్మా, రాజు, గ్రామస్తులు మోహన్‌రెడ్డి, యూ సుఫ్, సంజయ్‌కుమార్, శాంతప్పభాను, నరేష్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

## ఉపాధి హామీపై ప్రజా దర్బార్

**మనూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంపై నిర్వహించిన సామాజిక తనిఖీపై ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా డిఆర్‌డిఓ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలోఅసిస్టెంట్ డిఆర్‌డిఓ ఆచార్య, ఎంపిడిఓ షాజీలుద్దీన్, నాగేశ్వర్‌రావు, భోజిరెడ్డి, అమర్‌నాథ్, సుభాష్, సురేందర్, స్వామి, రాంబాబు, ఏపిఓ సాహెదు ఆయా గ్రామాల సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నక్షబాటలో అమర్చిన గేటు తొలగింపు



నక్షబాటలో అమర్చిన గేటును తొలగిస్తున్న అధికారుల దృశ్యం

**కంది, అక్టోబరు 21, ప్రభాతవార్త:** ఓడిఎఫ్ కర్మాగారం ముందర నక్ష బాటలో ఏర్పాటు చేసిన గేటును అధికారులు శుక్రవారం తొలగించారు. సర్వే నంబర్ 217, 218లోని భూమి నక్ష బాటలో ఉందని, అందుకు అక్కడ ఏర్పాటు చేసిన గేటును తొలగించినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి రాథోడ్ వివరించారు.

### పిహెచ్‌సిలో విద్యార్థులకు అవగాహన

**కంది, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వ్యాధి బారిన పడకుండా తీసు కోవాల్సి న జాగ్రత్తలు, సైబర్‌నేరాలపై పాటించాల్సి న పద్దతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ నవీన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పంటను పరిశీలించిన యాజమాన్యాలు



పంటను పరిశీలిస్తున్న శ్రీరాం సీడ్ యాజమాన్యం

**న్యాల్‌కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండలంలోని చినిగేపల్లి గ్రామంలో రైతు రాంరెడ్డి సాగు చేస్తున్న పత్తి పంటను శ్రీరాం సీడ్స్, శక్తి ప్లస్ సీడ్స్ అధికారులు రైతులతో కలిసి పంటను పరిశీలించారు. రైతు రాంరెడ్డి సాగుచేస్తున్న పత్తి పంటను పరిశీలించిన కంపెనీల యాజమాన్యం, రైతులు రైతు రాంరెడ్డిని అభినందించారు. రైతు సాగు చేస్తున్న తీరుపై, పాటిస్తున్న యాజమాన్య పద్ధతులపై రాంరెడ్డిని అడగితెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, బక్కారెడ్డి సతీష్‌కుల్‌కర్ణి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో టిఆర్ఎస్ పార్టీకి ఎదురులేదు

**-నాచగిరి ఆలయ డైరెక్టర్ మామిడి నరేష్‌గౌడ్**

**గజ్వేల్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** మునుగోడు నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీకి ఎదురులేదని, భారీ మెజార్టీతో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు తథ్యమని నాచగిరి ఆలయ డైరెక్టర్ మామిడి నరేష్ గౌడ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పంబాల శివకుమార్‌లు పేర్కొన్నారు. సిఎం కెసిఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలే మునుగోడు నియోజకవర్గంలో గెలుపుకు నాంది అవుతున్నాయని, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు మాయమాటలు చెప్పినా నమ్మరన్నారు. రాష్ట్రంలో సిఎం కెసిఆర్ పాలనలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, అదేవిధంగా రాబోయే రోజుల్లో మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. రోజురోజుకు బిజెపి పార్టీ నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్రంలో బిజెపి పని దగ్గరపడిందన్నారు. మునుగోడు నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, ఇస్మాయిల్, టిఆర్ఎస్ నాయకులు దొమ్మాట కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో తెరాస విజయం ఖాయం

**-తెరాస బిసిసెల్ అధ్యక్షుడు ఎం.శ్రీశైలం**



విలేకరులతో మాట్లాడుతున్న బిసిసెల్ అధ్యక్షుడు శ్రీశైలం

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 21 (ప్రభాతవార్త):** మునుగోడులో తెరాస పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారని జగదేవ్‌పూర్ మండల తెరాస పార్టీ బిసిసెల్ అధ్యక్షుడు మామిండ్ల శ్రీశైలం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన అభివృద్ధి గత ప్రభుత్వాలు ఎవరు కూడా చేయలేదని, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిలో ముందంజలో ఉంచారని, మునుగోడు అభివృద్ధి తెరాసతోనే సాధ్యమవుతుందని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు డిపాజిల్ కూడా దక్కదని అన్నారు. 60 ఏళ్ళ పాలనలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన అభివృద్ధిని చూసి మునుగోడులో తెరాస అభ్యర్థిని గెలిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెరాస అధ్యక్షుడు సుధాకర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇండెక్స్ ఫండ్ విడుదల చేసిన ఐడిఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్

ఐడిఎఫ్సీ మ్యూచువల్ ఫండ్ తాము ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్ ఐడిఎఫ్సీ క్రిసిల్ ఐబీఎక్స్ గిల్ట్ ఓపెన్ ఏప్రిల్ 2026 ఇండెక్స్ ఫండ్నువిడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా ఐడిఎఫ్సీ ఏఎంసీ సీఈఓ విశాల్ కపూర్ మాట్లాడుతూ మారుతున్న ఆర్థిక మార్కెట్ పరిస్థితుల్లో మదుపరులు తమపోర్ట్ ఫోలియోను నాణ్యమైన డెల్ట్ ఇన్స్టుమెంట్వ్యాప్తంగా విస్తరించాలను కుంటున్నారు.